క్లుప్తంగా

పర్యావరణంపై దృష్టి సారించాలి



నవోదయలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు

పెద్దాపురం: ఎన్‌సీసీ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించి మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలని జవహార్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి అన్నారు. స్థానిక జవహార్ నవోదయ విద్యాలయలో గురువారం విద్యాలయ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచంలో పర్యావరణాన్ని కాపాడేందుకు నేటి యువత, ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ మేకర్స్ శార్వాణి, పి.అనురాధ, ఎన్‌సీసీ అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్ అన్నారు. పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించగా విమలదేవి జైన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 9వ తేదీన సమ్మర్ క్యాంప్ ముగింపు పురస్కరించుకుని చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

గ్రావెల్ తవ్వకాల నిలిపివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి పరిధిలోని పోలవరం పుష్కర కాల్వ వద్ద అక్రమంగా జరుపుతున్న గ్రావెల్ తవ్వకాలను గురువారం అడ్డుకున్నట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. చెందుర్తి గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ అధికారి దొండపాటి చంటి బాబు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని అక్కడ గ్రావెల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఇంతిపల్లి జ్యోతి బాబు, జేసీబీ డ్రైవర్ లోండా శంకర్‌లను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు. అనుమతులు లేని గ్రావెల్ తవ్వకాలు గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. గ్రావెల్ లోడ్‌తో ఉన్న ట్రాక్టర్, జేసీబీని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ పేర్కొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



పాఠ్య పుస్తకాల సరఫరా ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలలు తెరిచే సమయానికి అన్ని పాఠశాలల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్స్ (పాఠ్య పుస్తకాలు) సిద్ధంగా ఉంటాయాని రాష్ట్ర అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జిల్లా నోడల్ ఆఫీసర్ బి.ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పాయింట్ వద్ద గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్స్‌ను పరిశీలించారు. అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేరవేసే ప్రక్రియపై మండల విద్యాశాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యార్థి మిత్ర కిట్లను ప్రతీ విద్యార్థికి అందించాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులపై ఉందన్నారు. సత్వరమే పాఠ్యపుస్తకాల పంపిణీపై దృష్టి సారించి పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని సబ్ స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ మరమ్మతులు, చెట్ల నరికివేత కారణంగా శుక్రవారం కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఏఈఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పవర, నవర, బ్రహ్మానందపురం, ఉండూరు, కాపవరం, పి.వేమవరం, చంద్రంపాలెం గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

ప్రోత్సహిస్తే పతకాలు పక్కా..!

- బాస్కెట్ బాల్‌కు పెరుగుతున్న ఆదరణ
- 13ఏళ్లుగా జూనియర్ కళాశాల ఆవరణలో శిక్షణ
- చిన్నారుల్లో పెరుగుతున్న ఆసక్తి



బాస్కెట్ బాల్ శిక్షణకు హాజరైన చిన్నారులతో నిర్వాహకులు

సామర్లకోట: వేసవి సెలవులల్లో చిన్నారులు ఆటపాటలతో కాలయాపన చేసే బదులు గుర్తింపు పొందిన ఆటలపై దృష్టి పెట్టి శిక్షణ పొందితే మంచి క్రీడాకారులు కావడానికి అవకాశం ఉంటుంది. దీనిలో భాగంగానే సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు కబడ్డీ, ఖోఖో శిక్షణలను సామర్లకోటలో నిర్వహిస్తున్నారు. సామర్లకోటకు చెందిన సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు గత 13 ఏళ్లుగా చిన్నారులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లోని బాస్కెట్ బాల్ కోర్టులో శిక్షణ ఇస్తున్నారు. వీరు ఇస్తున్న శిక్షణను జిల్లా స్పోర్ట్సు ఆథారిటీ గుర్తించింది. దీనిలో భాగంగా చిన్నారులకు శిక్షణ ఇవ్వడానికి అవసరమైన పరికరాలు బాల్స్, కిట్లు కొనుగోలు చేయడానికి జిల్లా కలెక్టరు నుంచి నిధులు వచ్చాయి. స్పోర్ట్సు ఆథారటీ నుంచి గుర్తింపుకు కూడా వచ్చింది. దాంతో ప్రతీ ఏడాది మే నుంచి జూన్ వరకు సుమారు 40 రోజులు సమ్మర్ బాస్కెట్ బాల్ శిక్షణ ఇస్తున్నారు.. వాకర్స్ అసోసియేషన్, గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్లు సంయుక్తంగా శిక్షణను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 80 మంది వరకు చిన్నారులు శిక్షణ పొందుతున్నారంటే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పక తప్పదు. ఈ శిక్షణ సీనియర్ పీఈటీలు, సీనియర్ బాస్కెట్ బాల్ ఆట గాళ్లు ఆధ్వర్యంలో జరుగుతుంది.

బాస్కెట్ బాల్‌పై ఆసక్తి కలిగి క్రీడాకారులను గుర్తించి వారికి ఉదయం, సాయంత్రం వేసవి కాలంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బాస్కెట్‌లో బాల్ వేసే సమయంలో డిఫెన్స్ ఏవిధంగా కాయాలి, డిఫెన్స్ చేస్తున్న క్రీడాకారుని నుంచి తప్పించుకొని బాల్ ఏవిధంగా బాస్కెట్‌లో వేయాలి అనే మెళకువలను చిన్నారులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఇదే సమయంలో నేలపై పడిన బాల్ వేగాన్ని గుర్తించడంలో మెళకులపై శిక్షణ ఇచ్చారు. మంచి బాస్కెట్ బాల్ క్రీడాకారులను తయారు చేయాలని తమ లక్ష్యంగా నిర్ణయించుకున్నామని నిర్వాహకులు చెప్పుతున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విశాలమైన ఆట స్థలం ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. క్రికెట్ క్రీడాకారుడి లక్‌పై ఆధారపడి ఉంటుందని, బాస్కెట్ బాల్ నైపుణ్యంపై ఆధారపడి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ క్రీడాకారుల సహకారంతో చిన్నారులకు శిక్షణ సమయంలో అల్పాహారం అందజేస్తునారు. గుడ్‌ఫ్రెండ్స్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు దేవానంద్, ఎండీపీ ప్రసాద్, పి. పాల్‌సుభకర్, సీహెచ్ నరేష్, జి. గిరిలు ప్రతీ రోజు శిక్షణను పర్యవేక్షిస్తున్నారు. బాస్కెట్ బాల్ కోచ్‌లు చల్లా దుర్గారావు, జి.ప్రేమ్‌కుమార్, కె.శ్రీకృష్ణ వర్మ, టి.కల్యాణ్‌లు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని వాకర్స్ అండ్ గుడ్ ఫ్రెండ్స్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రతీ ఒక్కరూ అభినందించాలి.



బంతి వేగాన్ని పరిశీలించడంపై శిక్షణ ఇస్తున్న కోచ్

క్రీడాకారుడిగా గుర్తింపు కావాలి



బాస్కెట్ బాల్ పోటీల్లో శిక్షణ పొంది మంచి క్రీడాకారుడిగా గుర్తింపు పొందాలని ఉంది. బాస్కెట్ బాల్‌లో వ్యక్తిగత ప్రతిభ కనబర్చే అవకాశం ఉంటుంది. ఐదేళ్లుగా సామర్లకోట కోర్టులో శిక్షణ పొందుతున్నాను. గత ఏడాది స్టేట్ మీట్‌లో ఆడాను, జాతీయ స్థాయిలో ఆడాలని ఉంది.

వి.కిరణ్, 9వ తరగతి విద్యార్థి సామర్లకోట

చిన్నతనం నుంచి ఆసక్తి



బాస్కెట్ బాల్ అంటే చిన్నతనం నుంచి ఆసక్తి పెరిగింది. దాంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇస్తున్న శిక్షణలో గత రెండేళ్లుగా మెళకువలు పొందుతున్నాను. మహిళా క్రీడాకారిణిగా దేశానికి మంచి గుర్తింపు తీసుకు రావాలనే ఆశ ఉంది. దీనిలో భాగంగా స్టేట్ సెలక్షన్‌లో పాల్గొన్నాను. జాతీయ స్థాయి సెలక్షన్‌లో పాల్గొన్నాలని ఉంది. ఎంతో శ్రద్ధతో నిర్వాహకులు శిక్షణ ఇస్తున్నారు.

పవిత్ర, 8వ తరగతి విద్యార్థిని, సామర్లకోట

పంచారామ క్షేత్రంలో యోగా శిక్షణ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 6.గంటల నుంచి 8.గంటల వరకు యోగాపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీ విద్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్ని యోగాపై శిక్షణపై మెళుకువలు నేర్చుకొవాలన్నారు.

వర్మీ కంపోస్టు యూనిట్‌కు స్థల సేకరణ



వర్మీ కంపోస్టుకు స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సామర్లకోట: మండల పరిధిలో హుస్సేన్‌పురం గ్రామంలో వర్మీ కంపోస్టు యూనిట్ ఏర్పాటు చేయడానికి గురువారం స్థల సేకరణ చేశారు. గ్రామంలో వర్మీ కంపోస్టు యూనిట్ లేకపోవడంతో స్థానికుల సహకారంతో గ్రామ నాయకులు చల్లా బుజ్జి, మార్ని సూర్యారావు తదితరులు స్థలాన్ని గుర్తించారు. స్థల సేకరణ చేస్తే.. యూనిట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హామీ ఇచ్చినట్టు బుజ్జి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



విద్యుదాఘాతంతో నిర్జీవంగా పడి ఉన్న ఆవు

కొత్తపల్లి: మండలంలోని గోర్స శెట్టిబలిజ పేటలో గురువారం ఓ ఆవు విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. బాధిత పాడి రైతు కాదా ఏసుబాబు తెలిపిన వివరాల ప్రకారం ఇళ్ల మధ్యలోనే ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు ఆవు మేస్తూ వెళ్లింది. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఫ్యూజు తీగలు కిందకు ఉండటంతో తగిలి విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిందన్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు రూ.40 వేలు విలువ చేసే ఆవు మృతి చెందిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

మండలంలో ఇప్పటి వరకూ ఇటువంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నా ఏ ఒక్క సంబంధిత అధికారి పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఏర్పాటు చేసే ఎర్త్ వైర్లు ఎటువంటి రక్షణ లేకపోవడం, విద్యుత్ అధికార్ల నిర్లక్ష్యంతో గేదెలు, ఆవులు మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా సంభంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలనూ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ స్వాతి

పిఠాపురం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తన దుకాణదారులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని పిఠాపురం వ్యవసాయ శఋూఖ ఏడీఏ పి.స్వాతి విత్తన దుఖాణదారులకు సూచించారు. పిఠాపురం వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు చెందిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డీలర్లు విక్రయించే విత్తనాలను ముందుగా మొలక శాతం పరిశీలించాలన్నారు. 80 శాతంకు మించి ఉంటేనే విత్తనాలు అమ్మాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరమైన విత్తనాలు ఎరువులు పురుగు మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎంఆర్‌పీ ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, కొత్తపల్లి వ్యవసాయ శాఖాధికారులు ఏ అచ్చుతరావు, వి.జోగిరాజు డీలర్లు పాలొగన్నారు.

అందుబాటులోకి ఎంఎల్‌టీ కోర్సు

ఏలేశ్వరం: ఈ ఏడాది నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) గ్రూపును ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్ రాజశేఖర్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఎంఎల్‌టీ గ్రూపు ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. పరిమిత సీట్లు కలిగిన ఈ పారా మెడికల్ కోర్సునందు చేరేందుకు ఆసక్తి గ ల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలన్నారు. కళాశాల యందు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంపీహెచ్ గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం కళాశాలలో క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు.

ఆదమరిస్తే గోతిలోకే..



కొమరగిరి ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు, మధ్యలో రంధ్రం పడిన శ్లాబు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి ప్రధాన రహదారిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. గోర్స జంక్షన్ నుంచి కొమరగిరి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రోడ్డులో నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయ సమీపాన పంట కాలువపై ఉన్న కల్వర్టు ఒకవైపు కూలి ప్రమాదకరంగా ఉంది.

దీంతో గ్రామస్తులు, వాహన చోదకులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్వర్టు కూలితే గ్రామంలోకి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

భగ్గుమంటున్న భానుడు



నిర్మానుష్యంగా ఉన్న ద్వారపూడి కెనాల్ రోడ్డు

సామర్లకోట: రోహిణి ప్రారంభం కావడంతో గత ఆరు రోజులుగా ఎండలు మండి పోతున్నాయి. మే నెలలో వర్షాలు కురవడంతో ప్రజలు ఊరట చెందారు. ఆ ఊరట నుంచి కొలుకొనక ముందే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. రోహిణికి ముందుగా వర్షాలు కురియడం వలనే ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని పర్యావరణ నిపుణులు చెప్పుతున్నారు. గురువారం ఉదయం 8.గంటల నుంచే నిప్పులు చెరిగాడు. సాయంత్రం ఆరు అయినా ఎండ వేడి తగ్గక పోవడంతో వేడి గాలులు వీస్తున్నాయి. దాంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరితో అల్లాడిపాతున్నారు. ఏదో ఒక సాకుతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న కారణంగా ప్రజలు అల్లాడిపాతున్నారు. ఎండలోను తమ తమ పనులు చేసే కొవడానికి అనేక మంది తలకు రక్షణ కల్పించి కొని ప్రయాణాలు సాగించారు. దాంతో తలకు గుడ్డలు కప్పుకొని వాహనాలపై రాక పోకలు సాగిస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో వివిధ రకాల పండ్ల జ్యూస్‌లు, చెరుకు రసం, కొబ్బరి బొండాలు ఎక్కువగా డిమాండ్ ఏర్పడింది.



తలకు రక్షణగా చున్నీ కప్పుకొని ప్రయాణిస్తున్న మహిళ



ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్త పడుతూ ప్రయాణిస్తున్న యువతి

పర్యావరణాన్ని పరిరక్షించాలి



సామర్లకోట సత్యనారాయణపురంలో మొక్కకు నీరు పోస్తున్న కమిషనర్

సామర్లకోట: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సత్యనారాయణపురం ఎఫ్‌సీఐ రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతి ఇంటిలోను రెండు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శశిధర్, ఏఈ ఎం.రమేష్, మేనేజరు కనకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు రాజశేఖర్, కౌన్సిలర్లు సేపెని సురేష్, బలుసు వాసు, మాజీ కౌన్సిలర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హుస్సేన్‌పురం గ్రామంలో చల్లా బుజ్జి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

సాగుపోతున్న ఆయిల్ పామ్

- రైతులకు ప్రత్యేక రాయితీలు
- ఇప్పటికే 1,500 ఎకరాల్లో సాగు
- మరో నాలుగు వందల ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు



డి.పోలవరంలో పతంజలి సంస్థ నర్సరీలో సాగవుతున్న ఆయిల్‌పామ్ మొక్కలు



కొలిమేరులో సాగవుతున్న ఆయిల్‌పామ్ పంట

తుని రూరల్: వాణిజ్య పంటలలో ఆయిల్‌పామ్ సాగు రైతులకు భరోసాగా నిలుస్తుంది. దేశీయంగా వంట నూనె ఉత్పత్తికి, విదేశీ మారకద్రవ్యం ఆదాకు, సాగుదారులకు నికర ఆదాయం పొందేందుకు ఆయిల్‌పామ్ తోటల సాగు ఉపయోగంగా మారింది. ఈ నేపథ్యంలో సాగు విస్తరణకు ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహిస్తూ రాయితీలు అందిస్తున్నాయి. ఉద్యానశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటికే 1,500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్నాయి. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో ఈ సంవత్సరం మరో మూడు వందల నుంచి నాలుగు వందల హెక్టార్లలో సాగు విస్తరించేందుకు అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. కొత్తగా సాగు చేపేట్టే రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి, ఎరువుల రాయితీ అందిస్తామని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు.

సాగు విస్తరణకు రాయితీలు

సన్న చిన్నకారు రైతులకు వందశాతం రాయితీపై మొక్కలను పతాంజలి సంస్థ అందిస్తుంది. తోటల నిర్వహణలో భాగంగా సంవత్సరానికి ఎరువులు నిమిత్తం రూ.5,250లు చొప్పున నాలుగేళ్లలో రూ.21వేలు రాయితీ లభించనుంది. ఫలసాయం అందే వరకు అంతర పంటలు సాగు చేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చు. అంతర పంటలుగా పూల తోటలు, కూరగాయలు వంటి పంటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు విత్తన రాయితీలు అందిస్తుంది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసుకుని బిల్లులను ఉద్యాన అధికారులకు అందజేస్తే రూ.5250లు చొప్పున నాలుగేళ్లు ప్రోత్సహకాలు పొందవచ్చును.

మార్కెట్ సదుపాయం : ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. పతంజలి సంస్థ నర్సరీ నుంచి ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలు పొందవచ్చు. నాలుగు సంవత్సరాలు ఎరువులకు, అంతర పంటల సాగుకు ఏకకాలంలో వేర్వేరుగా రాయితీలు లభిస్తాయి. అంతర పంటలతో అదనపు ఆదాయం సమకూరుతుంది. మార్కెట్ సదుపాయానికి భయపడాల్సిన అవసరం లేకుండ పతంజలి సంస్థ ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరనే పతంజలి సంస్థ చెల్లిస్తుంది. కొనుగోలు చేసిన గెలలకు ఆన్‌లైన్ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమావుతాయి.

30 ఏళ్ల ఫలసాయం

నాలుగు సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలు లోపు వరకు ఆయిల్‌పామ్ తోటల నుంచి ఫలసాయం లభిస్తుంది. ఆయిల్‌పామ్ గెలలను పెద్దాపురం సమీపంలో ఉన్న పతంజలి సంస్థ కొనుగోలు చేస్తుంది. ఎకరాకు పది నుంచి 12 మెట్రిక్ టన్నుల ఆయిల్‌పామ్ గెలలు దిగుబడి లభిస్తుంది. సంవత్సరానికి రూ.1.50 లక్షలు వరకు ఆదాయం లభించనుంది. నిర్వహణ, గెలలు సేకరణకు ఖర్చులగా రూ.40వేల నుంచి రూ.50వేలు అయినా నికరంగా రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

రత్నగిరిపై వన మహోత్సవం

అన్నవరం: మనం వనం కార్యక్రమంలో భాగంగా గురువారం అన్నవరం దేవస్థానంలోని పలుచోట్ల మొక్కలు నాటారు. సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాల, దేవస్థానం హైస్కూల్, వివిధ సత్రాల ఆవరణలలో మొక్కలను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు నాటారు. దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ. ఏఈఓలు కె.కొండలరావు, ఎల్ శ్రీనివాస్, డీఈలు గుర్రాజు, సూపరింటెండెంట్లు భాస్కర్, కృష్ణప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెంపకంలో కానరాని శ్రద్ధ

ప్రతి ఏటా దేవస్థానంలో వనమహోత్సవం, మనం వనం తదితర కార్యక్రమాలలో వందలాది మొక్కలను నాటుతున్నారు. నాటడంలో చూపిన శ్రద్ధ పెంపకంలో చూపడం లేదు. మొక్కలు నాటే విషయంలో ఆర్భాటంగా ఫొటోలకు ఫోజులిస్తుంటారు. ఆ ఒక్కరోజే హడావిడి. మరుసటిరోజు ఆ మొక్కలకు నీళ్ల పోసేవారు కూడా ఉండడం లేదు. దీంతో దేవస్థానం అధికారులు నాటిన మొక్కల్లో దాదాపు 90 శాతం చనిపోతున్నాయి. కేవలం పది శాతం మాత్రమే అది కూడా నీటి వనరులకు దగ్గరగా ఉన్న చోట మాత్రమే బతుకుతున్నాయి. గురువారం నాటిన మొక్కల్లో కనీసం సగమైనా బతికేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలి. తాము నాటిన మొక్కలు ఎలా ఉన్నాయో కనీసం వారం రోజులకు ఒకసారైనా చూడాలి. అప్పుడే ఈ కార్యక్రమానికి సార్థకత సమకూరుతుందనే అభిప్రాయం భక్తుల నుంచి వ్యక్తమవుతోంది.